

నూతన దంపతులకు చంద్రబాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ కుమారుడి వేడుక తూకివాకం సమీపంలోని ఆర్‌పిఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఉదయం విచ్చేసిన నారా చంద్రబాబుకు నరసింహయాదవ్ దంపతులు ఘన స్వాగతం పలికారు. అందరినీ పలకరిస్తూ చంద్రబాబు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అక్కడే తిరుపతి ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరించారు. మధ్యాహ్నం 12.38 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో చంద్రబాబుకు సాదర వీడ్కోలు లభించింది. డీఐజీ షిమోషి బాజ్పాయ్, కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి మునిసిపల్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నెల్లూరు జిల్లాలోని కార్యక్రమంలో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ చదలవాడ క్రిష్ణమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా 'గ్రూప్ 2' మెయిన్స్ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆదివారం జరిగిన ఎపిపిఎస్సీ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆదివారము ఉదయం 10 నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుండి 5:30 వరకు రెండు సెషన్ల లో ఎపిపిఎస్సీ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష జరిగిందన్నారు. తిరుపతిలో నిర్వహించిన 13 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలకు 5,801 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం పేపర్ 1 పరీక్షకు 5,055 మంది హాజరు కాగా 87.14 శాతంగా, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షకు 5046 మంది హాజరు కాగా 86.99 శాతం మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుండి బందోబస్తు నడుమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు తరలించారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఉదయం పట్టణంలోని సదరు గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష కేంద్రాలను పలు వాటిని ఆకస్మిక తనిఖీ చేసారు. ఏపీపిఎస్సి నిబంధనల మేరకు అన్ని విధాల పకడ్బందీ చర్యలు చేపట్టి పరీక్షలు నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బిడ్డల తల్లులు, భర్తలతోనూ, కుటుంబ సభ్యులతోనూ కనిపించారు.

పరీక్ష రాసిన నూతన వధువు

చిత్తూరులో ఉదయం 6 గంటల ప్రాంతంలో వివాహం చేసుకున్న మమత డైరెక్టుగా పెళ్లిబట్టల్లోనే తిరుపతి శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల వద్ద గ్రూప్ 2 పరీక్షరాయడానికి హాజరయ్యారు. తలపై జీలకర్ర బెల్లంతోనే పెళ్లిబట్టల్లో పరీక్షా కేంద్రం వద్ద కనిపించిన నూతన వధువును అందరూ ఆసక్తిగా చూడటం కనిపించింది. ఆమెతో వచ్చిన కుటుంబ సభ్యులు సైతం దగ్గరుండి ధైర్యం చెబుతూ 'బెస్ట్ ఆఫ్ లక్' చెప్పి పరీక్షా కేంద్రంలోకి సాగనంపారు.



పరీక్షా హాల్లో విద్యార్థులను కిటికీ నుంచి పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పెండ్లి మండపం నుంచి... పరీక్షా హాల్లోకి పెళ్లికూతురు

'పూడి' దళితవాడలో 'జీబీఎస్' కలవరం

నిర్ధారణ అయితే జిల్లాలో మొదటి కేసు

ప్రస్తుతం స్విమ్స్‌లో నిలకడగా ఆరోగ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పూడి దళితవాడకు చెందిన 56 ఏళ్ల మహిళకు జీబీఎస్ వైరస్ లక్షణాలున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. లక్ష మందిలో ఒకరికి సోకే ఆ అరుదైన వైరస్ తొట్టంబేడు మండలంలోని ఓ మహిళకు సోకిందన్న నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా కలుషితమైన నీటిని తాగడం వల్ల ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశస్తుందన్న తరుణంలో కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు శనివారం పూడిలోని ఆర్వో ప్లాంటును సందర్శించారు. ప్లాంటు వద్ద నీటి నమూనాలను సేకరించారు. వివరాల్లోకి పోతే.. పూడి దళిత వాడకు చెందిన 56 ఏళ్ల మహిళ పది రోజుల కిందట జ్వరం బారిన పడింది. పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంది. నాలుగు రోజుల అనంతరం జ్వరం మరింత తీవ్రం కావడంతో గ్రామంలోని వైద్య సిబ్బంది వద్ద చికిత్స తీసుకుంది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో నాలుగు రోజుల కిందట తిరుపతి స్విమ్స్ లో చేరి చికిత్స తీసుకుంటోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నా నడుం కింద నుంచి కాళ్ళ వరకు శరీరావయవాలు సహకరించడం లేదని సమాచారం. మహిళకు వ్యాధి నిర్ధారణ అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఇదే మొదటి కేసు కానుంది. ఇప్పటివరకు కేరళ, మహారాష్ట్రల్లో కలకలం సృష్టించిన జీబీఎస్ వైరస్ తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా 54 మంది జీబీఎస్ వైరస్ బారిన పడి చికిత్స తీసుకుంటున్నట్లు ఇటీవల రాష్ట్ర వైద్య శాఖ మంత్రి ప్రకటించారు. తాజాగా తొట్టంబేడు మండలంలో ఈ వైరస్ లక్షణాలతో మహిళ చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ విషయంపై కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధవ్ ను వివరణ కోరగా మహిళకు వ్యాధి లక్షణాలు ఉన్న మాట వాస్తవమే అన్నారు. అయితే నిర్ధారణ అయ్యేవరకు ఏమి చెప్పలేమని తెలిపారు. పూడిలో తాగునీటి సరఫరా పై దష్టి సారించామని వివరించారు.

కాగా గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) బారిన పడ్డ వారిలో వేళ్ళు, మడమలు, మణికట్టు వద్ద సూదులు పొడుస్తున్నట్టు అనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కాళ్లలో మొదలైన బలహీనత పైకి విస్తరిస్తూ రావటం, నోరు వంకర పోవడం, మాట్లా డటం, నమలటం, మింగటంలో ఇబ్బంది కలగడం, ఒకటికి రెండు దశ్యాలు కనిపించటం, కళ్లను కదిలించ లేకపోవటంలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే చివరకు పక్షవాతం బారిన పడే అవకాశం ఉందనీ, ఈ లక్షణాలు ఉన్నవారు వెంటనే స్థానిక ఏరియాస్పత్రుల్లో పరీక్షలు చేసుకుని ప్రాథమిక దశలోనే చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

'డబ్బు' ఉంటేనే 'వైద్యం'

ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా మారాలి

బాధ్యత నుంచి తప్పకున్న ప్రభుత్వం

ఆరోగ్యభద్రతకై చట్టం చేయాలని తీర్మానం

'ప్రజారోగ్య వేదిక' సదస్సులో రిటైర్డ్ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

డబ్బున్నోళ్లకే వైద్యం అందుబాటులో ఉంటుందని, దేశంలో ఆరోగ్యం అనేది ప్రాథమిక హక్కుగా మారాలని, ఇన్స్యూరెన్స్‌ల పేరిట ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పుకుంటోందని రిటైర్డ్ ఐఎఎస్‌లు డాక్టర్ సుజాతారావు, డాక్టర్ పివి రమేష్ అన్నారు. ఆదివారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో వేమన విజ్ఞాన కేంద్రం, ప్రజారోగ్య వేదిక, ఎస్వీ మెడికల్ కళాశాలలు సంయుక్తంగా 'ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం... సామాజిక బాధ్యత' అంశంపై సదస్సును నిర్వహించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌వి రమణయ్య అధ్యక్షత వహించారు. 'ఆరోగ్య భద్రతకై చట్టం చేయాలి' ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ప్రవేశపెట్టన తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది.

(వార్త జనరల్‌లో...)



తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన వైద్య ఆరోగ్య సదస్సు

జర్నలిస్టులకు నడక తప్పనిసరి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జర్నలిస్టులు వృత్తిపరంగా ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటారని, ఆరోగ్య సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవలని, ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయం నడక తప్పనిసరి అని ఆస్టర్ నారాయణాద్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాలచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, జర్నలిస్టులకు పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 224 మంది జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు సుగర్, థైరాయిడ్, కొలస్ట్రాల్, ఈసీజీ, పిఎఫ్‌టి పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ రెడ్డి, పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రీతమ్, గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిష, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాయిరాం తేజ, అసిస్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్, అసిస్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మధు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ యశోద్ పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో

తిరుపతిలో మెగా మెడికల్ క్యాంపును జెసిఐ తిరుపతి ఒడిస్సీ చాప్టర్, ప్రణీత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుచానూరులోని పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ కాలేజీలో జరిగింది. 500 మది వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకున్నారు. కళాశాల చైర్ పర్సన్ పి సులోచన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ, ఫౌండేషన్ చైర్మన్ ప్రణీత్, జెసిఐ అంతర్జాతీయ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి, జెసిఐ ఇండియా అడ్మినిస్ట్రేటివ్ కమిటీ సభ్యుడు జి ఎల్ మనోహర్ ప్రసంగించారు.

అదానీ, అంబానీలకు కొల్లగొట్టే బడ్జెట్

ప్రజాశక్తి - రేణిగుంట కేంద్ర బడ్జెట్ అదానీ అంబానీలకు కొల్లగొట్టేలా ఉంది తప్ప, సామాన్యులకు ఏమాత్రం కేటాయింపులు లేవని కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలిపారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సిపిఐ మండల సీనియర్ నాయకులు తులసిరాజన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన 50 లక్షల కోట్ల రూపాయల కేటాయింపులు శతకోటీశ్వరుల ప్రయోజనాలకేనన్నారు. ఈ రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో రేణిగుంట సిపిఎం కార్యదర్శి కె. ఈశ్వరమ్మ, చీరాలయ్య, ఏర్పేడు మండల నాయకులు రంగయ్య, పద్మమ్మ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ సెక్రటరీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుమల టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దేవాదాయ శాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్ ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో స్రి.హెచ్.వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. వి.వినయ్ చంద్ కు శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అదనపు ఈవో అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు భాస్కర్, ప్రశాంతి, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

సూర్యప్రభపై ముక్కంటి విహారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం(3వ రోజు) ఉదయం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రథంపై అధిరోహించి స్వామి వారిని అనుసరించారు. సూర్యప్రభ వాహనంపై పరమశివుడు విహరిస్తుండగా, మూషిక వాహనంపై వినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై స్వామి, అమ్మవార్ల వెంట అనుసరించారు. మిరుమిట్లు గొలిపే రంగుల వలె కొత్త గొడుగులు, పదాతి దళాలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, కోలాటాలు, భజన బందాలు ముందు నడుస్తుండగా, స్వామి, అమ్మవార్ల పురవిహారం జనరంజకంగా సాగింది. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకున్నారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో బాపి రెడ్డి పాల్గొన్నారు. స్వామీ అమ్మవార్ల వెంట పలు సాంస్కతిక ప్రదర్శనలు సాగాయి. ఆదివారం రాత్రి స్వామీ అమ్మవార్లు భూత, శుక వాహనాల్లో దర్శనమిచ్చారు. దీన్ని రెండవ తిరుణాళ్ల అంటారు.

ఆలయానికి అల్ట్రా హెచ్డీ టీవీల వితరణ

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి నెల్లూరు జిల్లా పూడిపర్తి గ్రామానికి చెందిన సారంగం రామచంద్రయ్య, ప్రమీల దంపతులు రూ.లక్ష విలువ చేసే రెండు అల్ట్రా హెచ్డి ఎల్జీ టీవీలను ఆదివారం వితరణ చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లైవ్ కవరేజీకి భక్తుల సౌకర్యార్థం వీటిని వినియోగించాలని దాతలు కోరారు. ఈవో.బాపిరెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు తిమ్మయ్య, వెంకటేశు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దని వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎంతగానో ఆశించారు. అయితే ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ సంఘం ఉపాధ్యక్షులు ఆలూరు పెంచల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సీలకు ఇస్తే రోజు వారి వేధింపులు, పెత్తనం, బెదిరింపులు, వేతనాలు సకాలంలో చెల్లించరని, పి.ఎఫ్ ఇ.ఎస్.ఐ నిధులు గోల్ మాల్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్‌చేయాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆదివారం ర్యాలీగా వివేకానంద రోడ్డు మీదుగా ముత్యాలపేట నుంచి గమళ్లపాలెంలోని గూడూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్‌కుమార్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఎ.పి.మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి బి.గోపినాథ్, గౌరవా ధ్యక్షులు జోగిశివకుమార్, పట్టణ కార్యదర్శి డి.కోటేశ్వరరావు, ఎన్. వెంకటరమణ, సి.రాజేష్, జి.మణి, టి.రాఘవ, సంపూర్ణమ్మ, మణెమ్మ, నారాయణమ్మ, పెంచలమ్మ, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు నాయకులు బీ.వీ.రమణయ్య, యస్. సురేష్, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

లేఔట్లు, భవనాలకు... 'సింగిల్ విండో' ..సులభతరం..!

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

గత ప్రభుత్వ హయాంలో కుదేలైన స్థిరాస్తి వ్యాపారానికి ఊరట కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భవనాలు, లేఅవుట్ల అనుమతులను సులభతరం చేసింది. సింగిల్ విండో విధానం ద్వారా భవన నిర్మాణాలకు అన్నిరకాల అనుమతులు ఒకే పోర్టల్ నుంచి పొందే వెసులు బాటు కల్పించనుంది. జిల్లాలో తిరుపతి నగరంతో పాటు నాయుడు పేట, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరు పేట పట్టణ ప్రాంతాలు జాతీయ రహదారులకు దగ్గరగా ఉండటంతో పట్టణీకరణ శరవేగంగా విస్తరిస్తోంది. స్థిరాస్తి వ్యాపారం పెరిగి అనేక కొత్త లేవుట్లు వెలిశాయి. అయితే ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో పట్టణాభివద్ధి సంస్థ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా లేఅవుట్లు పుట్టుకొచ్చాయి. స్థిరాస్తి వ్యాపారులు, భవన నిర్మాణ యజమానులు, బిల్డర్లు అనుమతులు పొందాలంటే రూ. లక్షలు ఖర్చు చేయడంతో పాటు కొన్నిచోట్ల స్థానిక ప్రజాప్రతినిధులకు ప్లాట్లు సైతం గిఫ్టుగా సమర్పించుకోవాల్సి వచ్చేది. వీటన్నింటినీ రూపు మాపేందుకు 'కూటమి' ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. లేఅ వుట్లు, భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేస్తూ కీలక ఆదేశాలు ఇవ్వడంతో నిర్మాణదారులు, లేఅవుట్ యజ మానులకు కొంత ఊరట కలిగింది. దీంతో పట్టణాల్లో అనుమతుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగే పని లేకుండా ఆన్లైన్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు తీసుకునే అవకాశం కల్పించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు అంతస్తుల భవనాలకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన లైసెన్సుడ్ సర్వేయర్లే ఇక నుంచి అనుమతులు ఇస్తారు. సర్వేయర్లే భవన నిర్మాణ ప్లాను దరఖాస్తును ఆన్లైన్లో అప్లోడ్ చేసి రుసుము చెల్లించిన వెంటనే అనుమతులు వస్తాయి. పునాది దశ నుంచి సర్వేయర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. నిర్మాణదారు అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడితే సర్వేయర్ లైసెన్సుపై పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకుంటారు.

కొత్త లేఔట్లు తుడా పరిధిలో

లే అవుట్ యాజమాన్యాలు అన్ని రకాల పత్రాలు తుడాకు సమర్పిస్తే 15 రోజుల్లోనే పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నారు. ఈ పద్ధతినే మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. తుడా పరిధిలోని చంద్రగిరి, తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్ , రేణుగుంట, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, నాయుడుపేట వరకు విస్తరించి ఉంది. తిరుపతి జిల్లా ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా అక్రమ లే అవుట్లపై తుడా టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు. అనధికారిక అక్రమ లేఔట్ నివారణ కోసం సింగిల్ విండో పద్ధతి తీసుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు

పట్టణాల్లో అనధికార లేఅవుట్ల వివరాలు

పట్టణం	లేఔట్	ఎకరాలు
తిరుపతి	47	96.04
పుత్తూరు	78	231.22
గూడూరు	50	137.59
వెంకటగిరి	32	108.35
శ్రీకాళహస్తి	28	180.84
సూళ్లూరుపేట	38	106.22
నాయుడుపేట	11	38.89

స్పెషల్ ఇంటర్వ్యూ

'సూర్య ఘర్'తో.. 'సౌర' వెలుగులు

'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ పీడీ శోభన్ బాబు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)

'వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతిఏటా రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షలకు పైచిలుకు సౌర విద్యుత్ ఉత్పాదకాలను ఈ పథకం ద్వారా ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తిరుపతి జిల్లా పరిధిలో సూర్య ఘర్ యోజన పథకం విధి విధానాల అమలు, సబ్సిడీ వివరాలను, డిఆర్డిఏ విభాగం ద్వారా ప్రజలకు చేకూరే ప్రాయోజిత కార్యక్రమాల వివరాలను ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు 'ప్రజాశక్తి' నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రజాశక్తి: తిరుపతి జిల్లాకు ఎన్ని కనెక్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదన పంపింది?

డిఆర్డిఏ పిడి: తిరుపతి జిల్లాకు సంబంధించి 15 వేల సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని మండలాలలో 400 నుండి 600 కనెక్షన్లు ఇచ్చేలా విస్తతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 3వేల మంది సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సౌర విద్యుత్తు ఏర్పాటుకు అంగీకారం తెలిపారు.

ప్రజాశక్తి: కనెక్షన్ తీసుకున్న వారికి ఎటువంటి సబ్సిడీలను అందిస్తున్నారు?

డిఆర్డిఏ పిడి: ఈ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలకు ప్రభుత్వమే ఉచితంగా కనెక్షన్లు ఇస్తుంది. ఎస్సీ ఎస్టీ యేతర సామాజిక వర్గాలకు బ్యాంకులు, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి సౌర విద్యుత్ కనెక్షన్ పొందేలా తగిన సహకారాన్ని అందిస్తున్నాం. ఒక కిలో వాట్ కనెక్షన్‌కు రూ.70 నుంచి రూ.80 వేల రూపాయల ఖర్చు అవుతుందని, ప్రభుత్వం నుండి రూ 60 వేల రూపాయలు సబ్సిడీ రూపంలో అందుతుంది.

ప్రజాశక్తి: సామాజిక పింఛన్ల తనిఖీ, జిల్లాలో మొత్తం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఎంతమందికి అందుతున్నాయి?

డిఆర్డిఏ పిడి: తిరుపతి జిల్లా పరిధిలో 33వేలమంది ప్రజలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్లలో నకిలీ పింఛన్ల తనిఖీలను నిర్వహించాలని, ఇందుకోసం ప్రత్యేక షెడ్యూల్ ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం వారంలో మూడు రోజులపాటు ఎంపిక చేసిన ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక వైద్యశాలల్లో ప్రత్యేక వైద్య బందంచే తనిఖీలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికీ తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం జూలై వరకు ఈ తనిఖీలు కొనసాగే అవకాశం ఉంది.

ప్రజాశక్తి: కొత్త పింఛన్ల నమోదుకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు ఏవైనా వచ్చాయా?

డిఆర్డిఏ పిడి: ప్రస్తుతం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల తనిఖీ కొనసాగుతున్న నేపథ్యంలో కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఉత్తర్వులు వెలువడలేదు. సామాజిక పింఛన్ల తనిఖీ పూర్తయిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు చేసే అవకాశం ఉంది. సదరం సర్టిఫికెట్లను కూడా ప్రస్తుతం జారీ చేయడం లేదు.

ప్రజాశక్తి: డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ అథారిటీగా రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు ఏదైనా నిర్వహిస్తున్నారా?

డిఆర్డిఏ పిడి: మా విభాగం నుండి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను గుర్తించి వారికి ప్రయోజిత కార్యక్రమాలను వారే స్వయంగా నిర్వహించుకునేలా తగిన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఎన్ ఆర్ ఎల్ ఎం ద్వారా నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులతో ఆయా మండలాలకు సంబంధించిన రైతులు వారు పండించే పంటలకు సంబంధించి అధిక దిగుబడి పొందేలా, మార్కెటింగ్ చేసుకునేలా తగిన వెసులుబాటును కల్పిస్తున్నాం.

తడి- పొడి చెత్తపై అవగాహన

చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్న డిపిఓ సుశీల దేవి

ప్రజాశక్తి -ఏర్పేడు : పాపానాయుడుపేటలో ఆదివారం నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డిపిఓ సుశీల దేవి పాల్గొన్నారు. వ్యర్థాల సేకరణ కోసం మీ ఇంటిముందుకే వస్తున్నామని, తడి చెత్త పొడి చెత్తను వేరు వేరుగా పంచాయతీ బండిలో వేయమని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డి రమణ కుమార్, సెక్రటరీ హరి కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నేతలు కృష్ణప్పమొదలి, జావర్ రెడ్డి, మురుగన్, కృష్ణయ్య, ముతక్కమొదలి తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ఐడి నమోదు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ఏర్పేడు: రైతులందరూ ఈ నెలాఖరులోగా రైతు విశిష్ట సంఖ్యకోసం నమోదు చేసుకోవాలని ఏర్పేడు మండల వ్యవసాయ అధికారి కె.షణ్ముఖం సూచించారు. నమోదు చేసుకున్నవారికి మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: ఆదివారం ఉదయం మండలంలోని రైతు భరోసా కేంద్రంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కార్యక్రమం వ్యవసాయ అధికారిణి భారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ గ్రామపంచాయతీ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా జోన్ చైర్మన్ ఆదిశేషా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయంగా తీసుకుంటామని తెలిపారు. లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ సేవలోనే సంతృప్తి అని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షులు ఆర్ రవిచంద్ర ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిరంలోని పేదలకు ఫల సరుకులు, చీరలు, దుప్పట్లు , ఫల సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లెపాటి మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, రూపేష్ రెడ్డి, మదనమోటి రమణయ్య, కళ్యాణ సాయి, బాలాజీ, సూళ్లూరుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

టెక్నాలజీని పరిశీలిస్తున్న శ్రీ గాయత్రి స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు టెక్నికల్ నాలెడ్జ్ హంటులో భాగంగా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కలిగిన ఎన్బికెఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఆదివారం సందర్శించి ఇంజనీరింగ్‌లో గల వివిధ శాఖలు, అనుబంధ ప్రయోగశాలలు, ఉపకరణాలు, రోబోటిక్ టెక్నాలజీ, ఏఐ ల్యాబ్ విశిష్టతలు తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఎన్బికెఆర్ కళాశాల ప్రొఫెసర్లు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ఫల సరుకులు పంపిణీ చేస్తున్న ప్రగతి సేవా సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరుపట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కీర్తిశేషులు శ్రీ పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సంపూర్ణ సహకారంతో బాలాజీ నగర్ ప్రగతి సేవా సంస్థ ఆఫీస్ నందు నిరుపేదలైన 15 కుటుంబాలకు 18 రకాల ఫల సరుకులు ఆదివారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, పిడి కరీముల్లా, కె ఆర్ ఎం, వాచ్ షాప్ రమణ, కుమార్ నాయుడు, డిష్ నాగరాజ్, గోల్డ్ షాప్ మల్లికార్జున, తూపిలి యశ్వంత్, కృష్ణారెడ్డి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై ఉక్కు పాదం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శివరాత్రి సందర్భంగా బాల్య వివాహాలు చేయడం ఆడ బిడ్డల జీవితాలను నాశనం చేయడమేనని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. ఎస్ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ బాల్యవివాహాలకు సహకరించడంకూడా నేరమని తెలిపారు.

వివాహ వేడుకల్లో కోనేటి సుమన్ కుమార్

నరసింహ యాదవ్ కుమారుడి వివాహ వేడుకలో సుమన్ కుమార్

ప్రజాశక్తి - పెద్ద టూరు: టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి ఐఖ్యటీసీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ ఆదివారం హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇంగోవన్ రెడ్డి, టిడిపి సీనియర్ నేత జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెబిఆర్ పాఠశాలలో ఘనంగా ఫేర్వెల్ డే

ఫేర్‌వెల్ డే వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు, జేబీఆర్ పాఠశాలలో ఆ సంస్థ అధినేత జే.బి.ఆర్. డాక్టర్ మునిరత్నం ఆధ్వర్యంలో ఫేర్వెల్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ విద్యార్థిని విద్యార్థులకు పరీక్షల్లో విజయ సాధనకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో, కళాశాల పాఠశాల ప్రిన్సిపాల్ భూలక్ష్మీ, ఏ ఒ అంకయ్య, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రంనాయుడుకు ఘన నివాళి

నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర మాజీ మంత్రి కింజారపు ఎర్రంనాయుడు 68 జయంతి సందర్భంగా పుత్తూరు పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జి. ధనపాల్, పరమేశ్వర నాయుడు మాజీ కౌన్సిలర్ పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ షఫీ నాయుడు, నాయకులు దాసరి విజయ్ చౌదరి, కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ భాస్కర్, మణికంఠ, కోటయ్య, మేఘనాథ్, బాబురావు, పరంధామయ్య, గాలి సుబ్రమణ్యం నాయుడు, ముని, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నీరు వృథా

- కుళాయిలు లేక నీరు రోడ్ల పాలు
- అధికారుల నిర్లక్ష్యం
- వేసవిలో పొంచి ఉన్న నీటి ఎద్దడి
- పారిశుద్ధ్య లోపం
- కాలువల్లో నిండిన చెత్త
- దోమలతో విష జ్వరాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని, నందిమంగళం గ్రామంలో తాగునీటి పైపు లైన్లో నిత్యం నీరు వృధాగా పారుతోంది. పలుచోట్ల పైపులకు కొళాయిలు లేకపోవడంతో నీరు వదిలినంతసేపూ వృధాగా ప్రవహిస్తున్నాయి. అసలే రానున్నది వేసవి కాలం. ఇలా వృధాగా పోతే తాగడానికికూడా నీరు దొరకదని గ్రామస్తులు తెలిపారు. పైపులకు కుళాయిలు బిగించి నీటి వృధాను అరికట్టాలని కోరుతున్నారు. ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. దానికి తోడు ఇలా నీరు పారడంతో, చెత్త చెదారం చేరి కాలువలు పూడిపోయి ఎక్కడికక్కడ బురదమయమవుతోంది. డ్రైనేజీ పారిశుధ్య లోపంతో దోమలు చేరి ప్రజలకు విష జ్వరాలు, డెంగు, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుళాయిలు ఏర్పాటు చేసి, డ్రైనేజీలో పూడుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

కాలువల్లో పారుతున్న తాగునీరు

కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తను సక్రమంగా తీయడం లేదు. వాటి వల్ల దోమలు చేరి రోగాలు వస్తున్నాయి. వీటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోరు.
- ఆర్ ఆర్ వెంకటేష్, నందిమంగళం

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాము. ఇలాంటి విషయాలు మా దృష్టికి రాలేదు. వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.
- మంజునాథ్, మున్సిపల్ కమిషనర్

ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలోని సీఎస్ తేజ కూడలిలో టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.ఎస్ తేజ సెంటర్‌లో మున్సిపాలిటీ స్థలంలో, ఎన్టీఆర్ జయంతి నాటికి విగ్రహం ప్రతిష్టించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంభేటీ విజయభాస్కర్ రెడ్డి, నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ, తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్, మైలారి రాజశేఖర్, పెళ్లకూరు మండలం టిడిపి అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న కాపులూరు పాఠశాల

పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -నాయుడుపేట: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యంల సహకారంతో నాయుడుపేట మండలంలోని కాపులూరు పాఠశాల అన్ని హంగులతో రూపాంతరం చెందనుంది. గతంలో ఈ పాఠశాల ప్రాంగణం లోతట్టుగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. దానికి తోడు పాఠశాల ప్రాంగణానికి ప్రహరీ గోడ లేకపోవడంతో ఆక్రమణ గురవుతూ వస్తోంది. ఈ నేపద్యంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చలంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే విజయశ్రీ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో పాఠశాల ప్రాంగణంలో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాఠశాల గుంట ప్రాంతంలో మట్టి తోలించి చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణ 'డాక్టర్ మేకింగ్ ప్రోగ్రాం' విజయవంతం

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రామ చంద్రాపురం, నారాయణ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'డాక్టర్ మేకింగ్ ప్రోగ్రాం' కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి దాదాపు 2000 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బలరామరాజు మాట్లాడుతూ జనాభాకు అవసరమైన వైద్యుల సంఖ్య తక్కువగా ఉందని, నారాయణ విద్యాసంస్థలు పాఠశాల స్థాయి నుంచే రూపకల్పన చేసిన నీట్ కోచింగ్ ప్రోగ్రాం చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సంస్థ డి.జి.యం. కొండలరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే నీట్ శిక్షణ ఇవ్వడం వల్ల తమ విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా నీట్ లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని, 2024 లో తమ విద్యార్థి సాయి చైతన్ రెడ్డి 720 కి 705 మార్కులు సాధించాడని తెలిపారు. జీర్ణ కోశ వ్యాధి నిపుణులు డాక్టర్ల సతీష్ చంద్రారెడ్డి నీట్ పరీక్ష అత్యధిక పోటీ గల పరీక్షని, దానికి నారాయణ విద్యాసంస్థలు అందించే శిక్షణతో సులువుగా సీట్లు సాధించడం వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీన్ లు ఏ.జీ.యం లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్శిటీ సిబ్బందికి ఆటల పోటీలు

సమావేశంలో వర్శిటీ అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బందికి క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి ఆచార్య వి.ఉమ హాజరై మాట్లాడుతూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలులో పాల్గొనడం వలన పని ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.జి.కరుణ సాగర్, పి.మునిరత్నం, వి.సుమతి, ఎమ్వి. రమణ, డా. రవికాంత్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పి.సృజనకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : కుప్పంలోని ద్రవిడ విశ్వ విద్యాలయం, రసాయన శాస్త్ర పరిశోధక విద్యార్థి పి.సృజనకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ద్రవిడ విశ్వ విద్యాలయం పరీక్షల అధికారి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు డా. టి. శోభారాణి పర్యవేక్షణలో " డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెథడ్ ఫర్ ద అనాలసిస్ ఆఫ్ న్యూ ఫార్మాస్యూటికల్ కాంపౌండ్ " అనే అంశం మీద సిద్ధాంత గ్రంథాన్ని వర్శిటీకి సమర్పించారు.ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం.. పోషకాల మణిహారం

శిక్షణ కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రుసా)మంజూరు చేసిన ప్రాజెక్టులో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై చంద్రగిరి మండలం, కందులవారిపల్లిలో మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మహిళలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందజేసి, తద్వారా వారిని సామాజిక వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఏపీ సిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం మాట్లాడుతూ ప్రతి ఇంటిలో చెత్తను ఎరువుగా ఉపయోగించి, ప్రకృతి వ్యవసాయ విధానంలో తప్పనిసరిగా కిచెన్ గార్డెన్ లేదా టెర్రస్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, కందులవారిపల్లి, నారావారిపల్లి, శేషాపురం గ్రామాల మహిళా రైతులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి యనమలను కలిసిన డా.హరికృష్ణ

ప్రజాశక్తి - క్యాంపస్ : మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడును ఎస్వీయు ఎన్ఎస్ఎస్ మీడియా కోఆర్డినేటర్ డా పాకనాటి హరికృష్ణ ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆర్థిక పరిస్థితిపై, నియామకాలపై యనమల ఆరా తీశారు. వర్సిటీలు ఆర్థిక ఆదాయాలు సమకూర్చుకోవాలంటే అంతర్జాతీయ స్థాయి నూతన కోర్సులను తీసుకురావాలని ఆయన సూచించారు. వర్సిటీ అధ్యాపక నియామకాల ప్రక్రియ విషయాన్ని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

ఐఐటీలో ముగిసిన తిరుత్సవ్

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ తారలు, సింగర్లు
సంస్కృతి, సాంకేతికత మేళవింపుగా ప్రదర్శనలు

సింగర్స్ సందడి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక తిరుపతి ఐఐటీలో మూడు రోజులపాటు అట్టహాసంగా నిర్వహించిన 'తిరుత్సవ్' ఆదివారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో భాగంగా ప్రముఖ వెండి తెర నేపథ్య గాయకులు హరిచరణ్ నేతత్వంలో సాగిన సంగీత ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యువతీ, యువకులు సాంప్రదాయ, పాశ్చాత్య వేషధారణలో రాంప్ వాక్ చేసి అలరించారు. ట్రెషర్ హంట్, టెక్ హీస్ట్ లాంటి పోటీల్లో యువత తమ సాంకేతికతకు, మెదడుకు పదును పెట్టి ప్రతిభ చాటారు. శనివారం జరిగిన తిరుత్సవ్‌లో అవసరాల శ్రీనివాస్ తన నటనతో యువతను ఉర్రూతలూగించారు. ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ ముగింపు వేడుకల్లో యువతకు చారిత్రాత్మక సందేశాన్ని ఇచ్చారు.

ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోండి

పొలంలో తవ్విన ఇసుక

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : దళితుల పొలాల్లో కొందరు అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టి తద్వారా లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక దోపిడదారులపై చర్యలు తీసుకోవాలని తిరుపతి, ఎస్ టి వి నగర్‌కు చెందిన మించల శంకరమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తనపల్లెలోని నల్లమణి కాలవ సర్వే నంబర్ 362 /1 లో దళితుల జీవనాధారం కోసం భూములు కేటాయించారని ఆమె తెలిపారు. ఆ భూమిలో దళితులు వ్యవసాయం చేసుకుంటూ జీవము సాగిస్తున్నారన్నారు. అయితే ఇటీవల ఆ భూములపై కన్ను వేసిన కొందరు రాజకీయ పలుకుబడితో, పోలీసులతో కుమ్మక్కై, ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తనపల్లి గ్రామానికి చెందిన పాలెం దయాకర్ ప్రధాన సూత్రధారి అని తెలిపారు. దీనిపై ప్రశ్నించిన తమపై దౌర్జన్యం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిపై దయాకర్ నకిలీ పత్రాలు సృష్టించి ప్రశ్నించిన వారిపై దాడి చేస్తున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరారు.

వలసదారులపై ట్రంప్ ప్రభుత్వ తీరు ఆక్షేపణీయం

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అక్రమ వలసదారుల పేరుతో యువతపట్ల అమెరికా ప్రభుత్వ వైఖరి నేరస్తులను వేటాడుతున్న తీరులో ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అమెరికా పార్లమెంటుముందు నుంచి ఆదివారం ఉదయం ఒక వీడియో విడుదల చేశారు. అక్రమ వలస దారులను తిప్పి పంపడాన్ని తాము వ్యతిరేకించడం లేదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం కూడా అమెరికాలో ఉన్న భారతీయ వలస దారులను వెనక్కు తీసుకుంటామనిందని గుర్తు చేశారు. వలస దారులను గుర్తించి, వారికి కొంత సమయం ఇచ్చి సుహృద్భావ వాతావరణంలో తిప్పి పంపే ఏర్పాటు చేసి ఉండాల్సిందని పేర్కొన్నారు.

క్రీడల అభివృద్ధే సీఎం లక్ష్యం

మెమెంటో అందిస్తున్న డాలర్స్

ప్రజాశక్తి - చంద్రగిరి: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి, క్రీడల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్ దివాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం చంద్రగిరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 12వ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లు ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాలర్స్ దివాకర్ రెడ్డి, డాక్టర్ పి.ప్రశాంతిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ కేర్ ఇన్స్టిట్యూట్ డాక్టర్ పి.ప్రశాంత్, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెటర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆర్ డి.ప్రసాద్, చైర్మన్ పడగల సురేష్, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రవి, టిడిపి మహిళా నాయకురాలు లంకెల్ల లలిత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా కనబడితే కబ్జానే

కలెక్టర్‌కు అర్జి పెట్టినా ఫలితం శూన్యం
ఇది అన్యాయం అని ప్రశ్నిస్తే ఎదురు దాడులు

అర్జీ ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామపంచాయతీ, అవిలాల హరిజన వాడలో ప్రభుత్వ భూమి గానీ, ప్రభుత్వ స్థలం గాని ఏదైనా ఉందంటే, ఆక్రమించి, రేకుల షెడ్లు నిర్మాణం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు. 2012లో ఒక ప్రభుత్వ ఉద్యోగి కొంత స్థలాన్ని కొన్నాడు. ఆ స్థలంలో 2017 లో రెండు అంతస్తులు భవన నిర్మాణం చేశాడు. ఇంటికి తూర్పు భాగాన స్థానిక ప్రజలకు అనుకూలంగా రోడ్డు మార్గం ఉండేది. ఆ రోడ్డు మార్గాన్ని స్థానికులు ఆక్రమించి అందులో రేకుల షెడ్లు వేసి రోడ్డు కూడా మాదే అంటూ కరెంట్ మీటర్ సర్వీసు తీసుకొని సీసీ కెమరాలు అమర్చుకున్నారు. ఇల్లు కట్టుకున్న యజమాని రోడ్డు ఆక్రమించుకొన్నారని, డ్రైనేజీ కాలువ పోవడానికి దారి ఏదని అడుగగా, అసలు నిన్ను ఇక్కడ లేకుండా చేస్తాను ఈని బెదిరిస్తున్నారు. ఆ ఇంటి యజమాని ఈ విషయంపై 2023 సంవత్సరం కలెక్టర్‌కి అర్జీ పెట్టుకున్నా ఏలాంటి స్పందన లేదు. మరోసారి జనవరి నెల 2025 సంవత్సరం ప్రజా ఫిర్యాదుల వేదికలో మాకు న్యాయం చేయండి అని ఆఇంటి యజమాని కలెక్టర్‌కి అర్జీ పెట్టుకోగా, రెవిన్యూ అధికారులను విచారణ నిమిత్తం పంపారు. ఆ ప్రాంతాని పరిశీలించిన రెవెన్యూ అధికారులు, రోడ్ ఆక్రమించిన వారికి నోటీసులు అందజేశారు. అక్కడి పరిణామాలను కలెక్టర్‌కి నివేదించినట్లు వెల్లడించారు.

వేగవంతమైన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ

ప్రజాశక్తి - చంద్రగిరి: రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ వేగవంతంగా నిర్వహించటానికి చర్యలు తీసుకున్నట్లు చంద్రగిరి మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలో శని, ఆదివారాలలో సిబ్బంది నమోదు ప్రక్రియను నిర్వహించారు.

క్రైం న్యూస్

లారీ ఢీకొని స్కూటరిస్ట్‌కు గాయాలు

ప్రమాదంలో గాయాలపాలైన సింగం శెట్టి చంద్ర

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లారీ ఢీకొని స్కూటరిస్ట్‌కి గాయాలైన సంఘటన గూడూరు రూరల్ పరిధిలోని పోటు పాలెం జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు పోటుపాలెం గ్రామానికి చెందిన సింగం శెట్టి చంద్ర అనే వ్యక్తి గూడూరు నుండి పోటు పాలెం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టడం జరిగిందన్నారు. దీంతో స్కూటర్ నడుపుతున్న చంద్ర అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలైనాడని తెలిపారు. క్షతగాత్రుడిని 108 ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

ఈతకు వెళ్లి యువకుడు మృతి

మృతి చెందిన చిప్పల వినీల్

ప్రజాశక్తి - నాయుడుపేట: నదిలో ఈత కొట్టాలన్న సరదా ఒక యువకుడి ప్రాణం తీసింది. నాయుడుపేట మండల పరిధిలోని కూచివాడ పాలెం వద్ద గల స్వర్ణముఖినదిలో ఆదివారం ఉదయం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్ళిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు గుణపాటిపాలెంకు చెందిన చిప్పల వినీల్ (19) తన స్నేహితులతో కలిసి కూచివాడపాలెం వద్ద స్వర్ణముఖి నదిలో ఈతకి వెళ్లి లోతైన గుంతలో చిక్కుకుపోయాడు. స్థానికులు అతనిని నది నుండి బయటకు తీసి గుణపాటిపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వినీల్ మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు.

మామిడి కాలవలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం, మేనకూరు వద్ద మామిడి కాలవలో గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నట్టు నాయుడుపేట సీఐ బాబి తెలియజేశారు. మేనకూరు విఆర్ఓ శ్రీనివాసులు అందించిన వివరాల మేరకు, ఆదివారం ఉదయం మేనకూరు గ్రామస్తులు మామిడి కాలవలో కొట్టుకొస్తున్న శవాన్ని గుర్తించి తనకు సమాచారం అందించారని తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉందన్నారు. వీఆర్వో సమాచారం మేరకు స్థానిక పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైవే ప్రమాదంలో..చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మృతి చెందిన భాస్కర్

ప్రజాశక్తి - వాకాడు: చిట్టమూరు మండల పరిధిలోని కొక్కి పాలెం గ్రామంలో మల్లాపు భాస్కర్ (42)శనివారం ఉదయం మృతి చెందారు. మృతుని బంధువుల సమాచారం మేరకు భాస్కర్ జనవరి-31 తేదీన జాతీయ రహదారి -16, బిరద వాడ సమీపంలో నాయుడుపేట వైపు బైకులో వస్తుండగా హైవేలో ప్రమాదం జరిగి స్పృహ లేకుండా పడిపోయాడు. 108 ద్వారా హాస్పిటల్‌కు తరలించి నాయుడుపేట ఆసుపత్రిలో ప్రధమ చికిత్స చేసి బంధువులకు అప్పగించారు. హైవే పోలీసుల సమాచారం మేరకు నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు. అనంతరం వివిధ ఆసుపత్రులలో వైద్య చేయించినప్పటికీ భాస్కర్ శనివారం మృతి చెందాడు. భాస్కర్‌కి భార్య సురేఖ (38), ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయి భార్య, పిల్లలు ఆదుకునేవారెవరని ఆవేదన చెందుతున్నారు.

సంపద కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

చెత్త నుండి సంపద కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చెత్త నుండి సంపద కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు మండల పంచాయతీ విస్తీర్ణధికారి దేవిక ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆమె మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమా న్ని కొద్దికాలంగా నిలిపివేశారని, వాటిని ఇప్పుడు అందరూ సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పోటీ పరీక్షలకు శ్రీ ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు

ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న పసుపులేటి కిషోర్ తదితరులు

ప్రజాశక్తి -కోట : ఈ-అబ్యాస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కలాం సైన్స్ అప్టిట్యూడ్ టెస్ట్ (కేసాట్) లెవెల్ 1 పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి కేసాట్ లెవెల్ 2 పోటీలకు 47 మంది శ్రీ ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు ఎంపికయ్యారు. వారు ఆదివారం నెల్లూరులోని హిమాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పరీక్షలకు హాజరయ్యారు. శ్రీ ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, ప్రగతి హాస్పిటల్ డాక్టర్ దివ్యప్రియ ముఖ్య అతిధులుగా హాజరై పరీక్ష ప్రశ్న పత్రాలను రిబ్బన్ కటింగ్ చేసి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో ఐఐటీ, నీట్‌లలో జాతీయ స్థాయి ర్యాంక్‌లు సాదించాలనే లక్ష్యంతో పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ కోర్స్‌లో శిక్షణ అందిస్తున్నామని, శిక్షణ పొందిన విద్యార్థు లు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. అందుకు కృషి చేసిన అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) SRIKALAHASTI
L.A.No.985/2024
H.M.O.P No.14/2028
Between
Devalla Roja ....Petitioner
And
Devalla Raja Babu ...Respondent
NOTICE TO RESPONDENT
To
Devalla Raja Babu,
S/o D.Satheiah, Residing at
Pudi Chennakesava Puram Village,
KVB Puram Mandal,
Tirupati District.
Whereas the above named Petitioner has filed the above Petition before the said Hon'ble Court for Recall the Petitioner in the above case on her side. As per the orders of the said Hon'ble Court the same is intimated to you by way of Publication and the above case is posted on 05-03-2025 for your appearance. Hence you or be present either in person through your counsel on 05-03-2025 at about 10:30 A.M before the said Hon ble Court or otherwise the matter will be decided ex-parte.
S. Nisar Ahmad, B.A, B.L,
Advocate for Petitioner,
Srikalahasti.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) SRIKALAHASTI
L.A.No.986/2024
H.M.O.P No.14/2028
Between
Devalla Roja ....Petitioner
And
Devalla Raja Babu ...Respondent
NOTICE TO RESPONDENT
To
Devalla Raja Babu,
S/o D.Satheiah, Residing at
Pudi Chennakesava Puram Village,
KVB Puram Mandal,
Tirupati District.
Whereas the above named Petitioner has filed the above Petition before the said Hon'ble Court for filing Documents on behalf of the Petitioner in the above case on her side. As per the orders of the Said Hon 'ble Court the same is intimated to you by way of Publication and the above case is posted on 05-03-2025 for your appearance. Hence you are be present either in person or through your counsel on 05-03-2025 at about 10:30 A.M before the said Hon'ble Court or otherwise the matter will be decided ex-parte.
S. Nisar Ahmad, B.A, B.L,
Advocate for Petitioner,
Srikalahasti.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) SRIKALAHASTI
L.A.No.984/2024
H.M.O.P No.14/2028
Between
Devalla Roja ....Petitioner
And
Devalla Raja Babu ...Respondent
NOTICE TO RESPONDENT
To
Devalla Raja Babu,
S/o D.Satheiah, Residing at
Pudi Chennakesava Puram Village,
KVB Puram Mandal,
Tirupati District.
Whereas the above named Petitioner has filed the above Petition before the said Hon'ble Court for Reopen the above case on her side. As per the orders of the said Hon'ble Cout the same is intimated to you by way of Publication and the above case is posted on 05-03-2025 for your appearance. Hence you are be present either in person or through your Counsel on 05-03-2025 at about 10:30 A.M before the said Hon ble court or otherwise the matter will be decided ex-parte
S. Nisar Ahmad, B.A, B.L,
Advocate for Petitioner,
Srikalahasti.

వైభవంగా శ్రీ కళ్యాణ వేంకటేశ్వరుడి వాహన సేవలు

ప్రజాశక్తి - చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం, శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం ఉదయం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4 గంటలకు స్వర్ణరథోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో, ఆలయ ప్రత్యేకాధికారి, సిపిఆర్వో డా.టి.రవి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు శ్రీ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


హనుమంత వాహనంపై దేవదేవుడు

గజవాహనం బ్రహ్మండనాయకుడు

మొగిలికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు, పలమనేరు జాతీయ రహదారిపై వున్న మొగిలి గ్రామంలోని శ్రీ మొగిలీశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు పలమనేరు డిపో నుండి 16, ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1.పలమనేరు నుండి మొగిలి మధ్య 5 బస్సులు. ఛార్జీ -20, 2. గుడియాత్తం , మొగిలి మధ్య 11 బస్సులు నడప నున్నారు. ఛార్జీ70, భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాన్నారు.

కుప్పం టౌన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గుడుపల్లి మండల పరిధిలోని మల్లప్ప కొండకు కుప్పం నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్రవిడ కూడలిలోని మల్లప్ప కొండపై వెలసిన మల్లేశ్వర స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు వస్తుంటారు. శివరాత్రి రోజు భక్తుల రాక మరీ ఎక్కువ ఉంటుంది. వారి సౌకర్యార్థం కుప్పం నుండి మల్లప్ప కొండకు 15 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. స్వామివారి భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేజీబీవీ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం ఆల స్యంగా వెలుగు చూసింది. కుప్పం పట్టణ పరిధిలో నివసిస్తూ కేజీబీవీలో కుట్లు, అల్లికలు శిక్షకురాలిగా పనిచేస్తున్న మహిళ శనివారం సాయంత్రం తన ఇంటిలో ఆత్మహత్యకు యత్నించినట్లు తన కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. ఇది గమనించిన వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సమయానికి చికిత్స అందించడంతో బాధితురాలి ప్రాణాలు మిగిలిందంటూ బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై స్పందించిన బాధితురాలు మాట్లాడుతూ తనపై అధికారి అనవసరపు ఛీదరింపులు తాళలేక మనస్థాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గతంలో కూడా కేజీబీవీలో వంట మనిషిగా పనిచేస్తున్న మహిళ పాఠశాల ఆవరణలోనే మృతి చెందారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికలు కోరుతున్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా నాయకులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందిస్తున్న లాకా వెంగళరావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ రిజర్వేషన్లు, బీసీ మంత్రిత్వ శాఖ, బీసీల గణణ చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పూల రాజేష్, తండై రాజేష్ ఆచారి, మహిళా అధ్యక్ష కార్యదర్శులుగా బుర్రా సావిత్రమ్మ, వై.విజయలక్ష్మి లను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ మహాసభ యువ నాయకులు శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

117 జీవో రద్దు చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పాఠశాల విద్యాశాఖ 117 జీవోను రద్దుచేసి, పాత విధానాన్ని కొనసాగించాలని, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు పుత్తూరు డివిజన్ విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు, మండల విద్యాశాఖ అధికారులు ఆదివారం ఆయన గృహంలో కలిసి వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. రాబోవు మార్చిలో జరిగే పదవ తరగతి విద్యార్థులకు చక్కటి తర్ఫీదు నిచ్చి మంచి ఫలితాలకోసం కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, తిరుమల రాజు, బాల సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, నమశివాయ, హరి ప్రసాద్ వర్మ, పద్మావతి, తులసి రామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌తో విద్యాశాఖ అధికారులు

శ్రీ గౌరీ సమేత భూపతేశ్వర స్వామి నగరోత్సవం

ప్రజాశక్తి - నాయుడుపేట: శివరాత్రి సందర్భంగా జువ్వలపాలెం, శ్రీ గౌరీ సమేత భూపతేశ్వర స్వామి ఆలయంలో నగరోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గురు స్వామి కొప్పాల సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 26వ తేదీ బుధవారం ఉదయం ఏడు గంటలకు జువ్వలపాలెం నుండి నగరోత్సవం ప్రారంభమవుతుందని నాయుడుపేట నుంచి పుదూరు, మిట్ట కండ్రిగ,అత్తలపాలెం, పాటిమిట్ట మీదుగా నగరోత్సవం ఏకశిరతిప్పకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు అయ్యవారి తోటలో వనభోజన కార్యక్రమం జరుగుతుందన్నారు.

అధికార నంది వాహనంపై ఆదిదేవుని దివ్యసచారం

సురుటుపల్లిలో బ్రహ్మండ నాయకుని బ్రహ్మోత్సవాలు
శాస్త్రోక్తంగా యాగశాల పూజలు

ప్రజాశక్తి - నాగలాపురం: సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజైన ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు అధికార నంది వాహనంపై శ్రీ పరమేశ్వరుడు, పల్లకి వాహనంలో శ్రీ పార్వతీ దేవిని అధీష్టించి ఊరేగించారు.

పొలాలపై ఏనుగుల దాడి

ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న అధికారి

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం ఎల్లంకి వారి పల్లి గ్రామం గోపా లపురం పరిసరాలలో శనివారం అర్ధరాత్రి 12 ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేశాయి. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఏనుగుల గుంపు భీమవరం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాయని తెలిపారు.

బాలాజీకి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - పలమనేరు: కవి, రచయిత, విమర్శకుడు పెద్ద పంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజి, కామాక్షి బాయి, నారాయణరావు స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. చిత్తూరు జిల్లా రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం వారు ఆదివారం సాయంత్రం చిత్తూరులో విజయం విద్యాసంస్థల ఆవరణలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. అవార్డు వ్యవస్థాపకులు ప్రముఖ రచయిత సి.ఎన్. చంద్రశేఖర్ చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్‌కు సాహితీ పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు, సాహితీ వేత్త కుప్పం రెడ్డమ్మ, సాహిత్య అవార్డు వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రామలక్ష్మి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు బాలాజీ, చదువుల బాబు, రచయితలు అరుణకుమారి, జి శ్రీనివాస పాల్గొన్నారు.

తలకోన సిద్ధేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -యర్రావారిపాలెం : శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం అంకురార్పణ చేశారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధా రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, పట్టు వస్త్రాలను సమర్పించి, శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో అరుణ, తాసిల్దార్ పరమేశ్వర స్వామి, అధికారులు మండల టిడిపి కూటమి నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.